క్లుప్తంగా

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం

బొబ్బిలి: అపరాలు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. 2024 డిసెంబరులో కురిసిన అకాల వర్షాలకు పెసర, మినుము పంటలు పాడయ్యాయని తెలిపారు. దీంతో చాలా మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. పంటల బీమా ప్రీమియం కట్టించుకున్నా బీమా మాత్రం చెల్లించడం లేదన్నారు. తక్షణమే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘ సభ్యులు రెడ్డి త్రినాథ, ఉడమల ప్రసాద్, పరశురాం తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలిరూరల్: చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో పోతల రవికుమార్ సూచించారు. మండలంలోని పక్కి, కమ్మవలస, పిరిడి గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించిన ఆయన.. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజల నుంచి సిబ్బందిపై ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సమయానికి విధులకు హాజరై, ప్రజలకు అందివ్వాల్సిన సేవలను సక్రమంగా ఇవ్వాలని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి



సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: రానున్న వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన.. ఇప్పుడే ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు చేయించాలన్నారు. హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్ డేటా పూర్తిని రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు.

పోస్టల్ సేవలను ప్రజలకు చేరువచేయాలి



మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

మెంటాడ: పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని గజపతినగరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర సూచించారు. మండలంలోని చల్లపేటలో మెంటాడ, చల్లపేట పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలోని పోస్టల్ శాఖ ఉద్యోగులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ నెల 19, 20వ తేదీల్లో పోస్టల్ మెగా ఇన్సూరెన్స్ మేళా నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతీ పోస్టల్ ఉద్యోగి ఈ కార్యక్రమంలో పాల్గొని, ఎక్కువ మందితో ఇన్సూరెన్స్ చేయించేందుకు కృషి చేయాలని కోరారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



నూలు వడికే విధానంపై అవగాహన కల్పిస్తున్న గైడ్ మధుసూదనరావు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర సందర్శన చేశారు. గురువారం అదే గ్రామంలో చేనేత వస్త్రాల తయారీ, మగ్గాలపై అల్లికలు, నూలు వడకడం వంటివి చేపట్టే సొసైటీ వద్దకు వెళ్లి, వాటి గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల చదువు బాగుంటుందని గైడ్ మధుసూదనరావు తెలిపారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని ఉనుకూరులో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 115 మందికి బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రీనాచౌదరితో పాటు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు.

ఉపాధి మేట్‌లదే..

- ఉపాధి హామీ పథకంలో మేట్‌లకు పెద్దపీట
- ప్రతీ 50 మంది వేతనదారులకు ఒక మేట్
- ఒక్కో వేతనదారుకు రూ.1.50 చొప్పున అదనంగా మేట్‌కు చెల్లింపు
- ఫీల్డ్ అసిస్టెంట్ లేనిచోట మేట్‌లకు పనుల బాధ్యతలు



రాజాం మండలంలోని శ్యాంపురం ఉపాధి పనుల వద్ద మేట్‌ల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు(ఫైల్)

రాజాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మేట్‌లు కీలకంగా మారనున్నారు. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేనిచోట మేట్‌లకు బాధ్యతలు అప్పగించారు. అలా కాకుండా ప్రతీ శ్రమశక్తి సంఘానికి ఒక మేట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేట్‌ల పరిధిలో కనీసం 50 మంది వేతనదారులు ఉంటారు. గతంలో 50 జాబ్‌కార్డులకు ఒక మేట్ ఉండేవారు. ఇప్పుడు మాత్రం 50 మంది యాక్టివ్ వేతనదారులంతా ఒక శ్రమశక్తి సంఘంగా ఏర్పడితే ఆ సంఘానికి మేట్ బాధ్యత వహిస్తాడు. ఇలా ఉన్న మేట్‌కు ఆరోజు పనికి వచ్చిన వేతనదారుల ఆధారంగా ఒక్కో వేతనదారునికి రూ.1.50 చొప్పున అదనపు వేతనాన్ని మేట్‌కు చెల్లిస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని సమయంలో సీనియర్ మేట్లు, పని నిబద్ధత కలిగిన మేట్‌లకు పనుల బాధ్యతలు అప్పగిస్తారు.

బలపేతం దిశగా శ్రమశక్తి సంఘాలు..

గతంలో శ్రమశక్తి సంఘాలు నామమాత్రంగానే పని చేసేవి. ఇప్పుడు 30 నుంచి 50 మంది వేతనదారులను శ్రమశక్తి సంఘంగా ఏర్పర్చుతున్నారు. ఈ సంఘాల ద్వారా వేతనదారులకు సకాలంలో పని కల్పించేలా, కనీస వేతనం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంఘాలకు చెందిన వేతనదారుడే మేట్‌గా వ్యవహరిస్తారు. ప్రతిరోజూ ప్రతీ వేతనదారునికి కనీసం రూ.300లు వేతనం గిట్టుబాటు అయ్యేలా మేట్‌లు పనిచేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. 100 రోజుల గ్యారంటీ పనిని పూర్తి చేయిస్తే ఆయా వేతనదారుని ద్వారా రూ.3లు అదనంగా ఆ సంఘ మేట్‌కు అందనుంది. ఇలా శ్రమశక్తి సంఘాలను బలోపేతం చేస్తున్నారు.

మేట్‌లకు అదనపు వేతనం..



ఇప్పుడు అన్ని గ్రామాల్లో శ్రమశక్తి సంఘాలకు మేట్‌ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల కోడ్ అనంతరం ప్రతీ గ్రామంలో శ్రమశక్తి సంఘాలు, మేట్‌ల ఎంపిక తప్పనిసరిగా జరుగుతుంది. మేట్‌లకు బాధ్యతలు అప్పగించడం ద్వారా అదనపు వేతనం కూడా లభిస్తుంది.

–వి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, రాజాం

రాజాం మండలంలో వేతనదారులు:	12,200 మంది
జాబ్‌కార్డులు:	10,030
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు:	244
అవసరమైన మేట్‌లు:	244 మంది

వంగర మండలంలో వేతనదారులు:	10,600 మంది
జాబ్‌కార్డులు:	10,030
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు:	212
అవసరమైన మేట్‌లు:	212 మంది

రేగిడి మండలంలో వేతనదారులు:	28,100 మంది
జాబ్‌కార్డులు:	16,084
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు:	562
అవసరమైన మేట్‌లు:	562 మంది

సంతకవిటి మండలంలో వేతనదారులు:	26,799 మంది
జాబ్‌కార్డులు:	14,740
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు:	536
అవసరమైన మేట్‌లు:	536 మంది

ముక్కు మూసుకోవాల్సిందే..



సంతకవిటి బస్టాండ్‌కు కూతవేటు దూరంలో రాజాం–సంతకవిటి ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే కోళ్ల అవశేషాలు, చెత్తాచెదారాలు ఇష్టానుసారంగా వేసేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపుగా వెళ్లిన వారంతా అక్కడికి వచ్చేసరికి ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే దారిలో అధికారులు సైతం ప్రయాణిస్తున్నా చర్యలు శూన్యమని వాహనదారులు వాపోతున్నారు.

–సంతకవిటి

నకిలీలపై చర్యలేవీ?



బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాల తయారీదారులపై చర్యలేవని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కొంతమంది రాజకీయ నేతలే ఇందిరమ్మ కాలనీలో పెద్దపెద్ద డూప్లెక్స్ ఇళ్లు నిర్మించుకున్నారని ఆరోపించారు. అలాగే లక్ష్మీశ్రీనివాస జూట్‌మిల్లు స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు అక్కడి ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించుకున్నారన్నారు. ఇటువంటి ఘటనలపై పోలీసులు, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు ఉన్నారు.

–బొబ్బిలి

ఒక్కసారైనా వాడితే ఒట్టు..



రాజాం మండలం, పాగిరి రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమశాతం కొలిచే మెషీన్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయినా ఎక్కడా ధాన్యం తేమశాతం కొలిచినట్లు గానీ పరికరాలు ఉపయోగించినట్లు గానీ కనిపించలేదు. ట్రక్ షీట్లు ఇచ్చి, ధాన్యం శాంపిల్స్ మిల్లర్లకు ఇచ్చేయమని వ్యవసాయ సిబ్బందే చెప్పేవారని రైతులు చెబుతున్నారు. తేమశాతం కొలవని కారణంగా తాము నష్టపోయామని వాపోతున్నారు.

–రాజాం

వంద రోజుల పని కల్పించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నం



రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ

రామభద్రపురం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ప్రతీ కుటుంబానికి వంద రోజుల పాటు పని కల్పించడమే లక్ష్యమని ఎంపీడీవో రత్నం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో త్రినాథరావుతో కలిసి గురువారం విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, వేతనదారులు రోజూ ఆరు గంటల కాలం పనిచేయాలని తెలిపారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ అనుబంధ పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫారంపాండ్‌లు, రింగ్ వెంచర్‌లు, ఫిష్ పాండ్‌లు, సోక్ పిట్స్ పనులు చేసేలా ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. గోకులాల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణాలు పూర్తయిన వాటికి త్వరలో బిల్లులు పడతాయన్నారు.

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, కాగితాపల్లి, ఏవీపురం, అంబాడ తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాథ గురువారం పరిశీలించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

తెర్లాం: విద్యార్థులంతా ఆంగ్లభాషపై పట్టు సాధించాలని ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నందబలగ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మింది విజయమోహనరావు సూచించారు. అదే పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల దినపత్రికలు పంపిణీ చేసి, వారితో పేపరు చదివించే కార్యక్రమం గురువారం చేపట్టారు. ప్రతిరోజూ ఆంగ్ల దినపత్రికలు చదవడం ద్వారా ఇంగ్లిష్‌పై మంచి పట్టు సాధించడమే కాకుండా స్పెల్లింగ్‌లు, పదబంధాలు తెలుస్తాయన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

బాడంగి: కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కుష్టువ్యాధి, దాని నివారణ చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలుంటే తమకు తెలియజేయాలని డాక్టర్ ఇమ్రాన్ సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రిని ఆశ్రయించి, వైద్యసేవలు పొందాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట, ఉంగరాడమెట్ట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఎంఈవో ఎరకయ్య గురువారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేశారా లేదా అని చూసి, వంట నిర్వాహకులకు సూచనలు చేశారు. రుచి, శుచికరమైన భోజనం పెట్టాలని, మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు.

కూరగాయల సాగు పరిశీలన



ఒడిశా రైతు బృందానికి కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామం వద్ద చేస్తున్న కూరగాయల సాగును ఒడిశా రైతు బృందం గురువారం పరిశీలించింది. ఇక్కడ కూరగాయల సాగులో అనుసరిస్తున్న బిందు, తుంపర సేద్యాలు, అంతర పంటలు, అంతస్తుల పంటల సాగు విధానాలను రాజాం ఉద్యానశాఖాధికారి ఉమామహేశ్వరి వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

బొబ్బిలి: స్థానిక 33 కేవీ సబ్‌స్టేషన్, గొల్లపల్లి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని సిరిపురపు వీధి, రత్నాలనగర్, బలిజిపేట రోడ్డు, రెల్లి వీధి, పాతబొబ్బిలి పరిసర ప్రాంతాలతో పాటు అలజంగి ఫీడర్ పరిధిలోని మరికొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

సంతకవిటి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలన్నారు.

దేవదాయ భూములపై తహసీల్దారు విచారణ



రైతులను విచారణ చేస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్

తెర్లాం:

మండలంలోని 14 గ్రామాల్లో దేవదాయ శాఖకు సంబంధించిన భూములపై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ రైతులను గురువారం విచారణ చేశారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో దేవదాయ శాఖ అధికారులు మండలంలోని దేవదాయ భూముల వివరాలు ఇవ్వాలని కోరగా, ఈ మేరకు ఆయా భూములను సాగు చేస్తున్న రైతులకు వీఆర్‌వోల ద్వారా నోటీసులు అందజేశారు. ఆ రైతులను వారు సాగు చేస్తున్న భూములకు సంబంధించి పత్రాలు తీసుకునిరావాలని తహసీల్దారు ఆదేశించగా రైతులంతా వన్–బి, పాసుపుస్తకాలు తదితర ఆధారాలు పట్టుకుని తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. తమ తాతముత్తాల నుంచి ఆ భూములను సాగు చేసుకుంటున్నామని, అవి దేవాదాయ భూములని తమకు తెలియదని రైతులు తెలిపారు. రైతులు చెప్పిన వివరాలను ఆయన నమోదు చేసుకున్నారు. ఇదే విషయాన్ని దేవదాయ శాఖ అధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వంగర: స్థానిక కేజీబీవీ, వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలల్లో యూటీఎఫ్ నాయకులు గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. తొలి ప్రాధాన్యతా ఓటు ఆమెకే వేసి, గెలిపించాలని అభ్యర్థించారు.

ఎరువు తయారు చేసుకోండి

రాజాం: ఇళ్లల్లోని వ్యర్థాలు విచ్చలవిడిగా బయట పారేయకుండా ఇంట్లోనే ఎరువు తయారు చేసుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. స్థానిక పట్టణ పరిధిలోని వాసవీనగర్, శ్రీనివాస రోడ్డు ప్రాంతాల్లో పలువురు మహిళలు తయారు చేస్తున్న హోమ్ కంపోస్ట్‌ను ఆయన గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనికిరాని చెత్తాచెదారంతో పూల మొక్కలు, కూరగాయ మొక్కలకు పనికి వచ్చే ఎరువు తయారు చేసుకోవచ్చన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని రాజాం ఐసీడీఎస్ పీవో డాక్టర్ కనకదుర్గ సూచించారు. మండలంలోని బూరాడ, ఉంగరాడమెట్ట, వండానపేట, కేఎంవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా గురువారం సందర్శించారు. కేంద్రాల్లో పౌష్టికాహార నిల్వలు, రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు.

భూ ఆధార్ చేయించుకోండి

రాజాం సిటీ: రైతులంతా భూ ఆధార్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఎం.రేణుకాసాయి తెలిపారు. మండలంలోని పొగిరి రైతు సేవా కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆమె.. అక్కడ జరుగుతున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని, దాని ద్వారా ప్రభుత్వ రాయితీలు, పథకాలు అందివ్వడం జరుగుతుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్ పట్టుకుని, రైతు సేవా కేంద్రానికి వెళ్తే భూ ఆధార్ చేస్తారన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: మండలంలోని నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ(గోడ) నిర్మాణ పనులను ఎంఈవో జె.త్రినాధరావు గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు.

హైకోర్టు తీర్పును అమలుచేయాలి

రేగిడి: ఏపీ హైకోర్టు తీర్పును అమలుచేయాలని రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గ్రామ పంచాయతీ స్థాయిలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల పనుల కేటాయింపులో అధికారులు చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందన్నారు. ఈ పనుల విషయంలో అధికారులు చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్నారని రేగిడి మండలంలోని లక్ష్మీపురం, మునకలవలస, గుళ్లపాడు పంచాయతీల సర్పంచ్‌లు కెంబూరి తేజోవతి, వావిలపల్లి చంద్రశేఖర్, వియ్యపు లావణ్యలు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. గ్రామ పంచాయతీలకు సంబంధం లేకుండా ఈ పథకం ద్వారా మంజూరైన పనులను అధికారులు ఏకపక్షంగా కేటాయిస్తున్నారని ఆరోపించారని, ఇది చెల్లబాటు కాదని ఆయా సర్పంచ్‌లు కోర్టులో వాదించడంతో వీరి వాదనను హైకోర్టు సమర్థించిందన్నారు. ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టం –16(5) అమలు చేయాలని కోర్టు చెప్పిందన్నారు.

సర్వే వేగవంతం చేయండి

రాజాం సిటీ: మండలంలో చేపడుతున్న చిన్నతరహా పరిశ్రమలు, దుకాణాల సర్వేను వేగవంతం చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన సర్వేపై సమీక్షించారు. మండలంలో ఇప్పటివరకు 480 మాత్రమే సర్వే చేయడం జరిగిందని, విద్యుత్ కనక్షన్ ప్రాప్తికి ఇంకా 590 చిన్నతరహా పరిశ్రమల సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ సర్వేను వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. అంతకుముందు గ్రామకంఠంలో నివశిస్తున్న వారికి ప్రాపర్టీ కార్డుల పంపిణీపై ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. అనంతరం పీఆర్ వన్ యాప్, స్వర్ణపంచాయతీ డేటా ఎంట్రీ, ఇంటి పన్నుల వసూళ్లు, హౌస్‌హోల్డ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: గ్రామాల్లో చేస్తున్న స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన.. గ్రామకంఠం పరిధిలో ఇళ్లు, ఖాళీస్థలాలను గుర్తించాలన్నారు.

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, లక్ష్మీపురం గ్రామాల్లో దివ్యాంగుల గుర్తింపు సర్వే గురువారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి అధికారుల బృందం వెళ్లి, ఎక్కడైనా ఎవరైనా అంగవైకల్యంతో బాధపడుతున్నారా లేదా అని పరిశీలించి, పేర్లు నమోదు చేసుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్రరావు

వంగర: యువత, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హనుమంతు ఉపేంద్రరావు సూచించారు. మండలంలోని మడ్డువలస గ్రామంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం, సిగరెట్, గుట్కా, పాన్ పరాగ్ వంటివి తీసుకోవద్దని తెలిపారు. ఫ్యాషన్ మాయలో పడి చాలామంది వాటికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు.